

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

కాంగ్రెస్‌లో చేరిన ముద్దగౌని దంపతులు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ఆయన సతీమణి బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలు కాంగ్రెస్ పార్టీలోకి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వీరు నాటకీయ పరిణామాల మధ్య మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా ఇటీవల మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి రామ్మోహన్‌గౌడ్ నివాసానికి వచ్చి అతనితో చర్చించడంతో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రామ్మోహన్‌గౌడ్ దంపతులు తిరిగి తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కత్తుల రాంబాబు, జోగు రాములు తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ ప్రత్యేక పూజలు

చంపాపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్‌కు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని వినాయకస్వామి, ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో కమిషనర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిషనర్‌కు పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం కమిషనర్ ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, మధుసాగర్, చీర తిరుమలేష్, భక్తులు బండారు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ సిబ్బంది వెంకటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సామ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

అరుణోదయ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

హయత్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని అరుణోదయ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సామ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుంగ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా గుమ్మి మధుసూదన్‌రెడ్డి, బొబ్బల జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బీ. మల్లారెడ్డి, కె. రాములుయాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా హరిప్రసాద్, ఉషారాణి, సత్యవతి, కోశాధికారిగా బద్దం గోపాల్‌రెడ్డి, ఆడిటర్‌గా కె. కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా సతీష్, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, అర్చన, పుష్ప, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, ఎంఎన్ మూర్తిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలను కలిసి అభివృద్ధి చేస్తానని అన్నారు.

ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్ బాషా

చంపాపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్ బాషా నియమితులయ్యారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ శనివారం సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్ బాషాకు నియామకపత్రం అందజేశారు. మస్తాన్‌బాషా మాట్లాడుతూ తనను పదవిలో నియమించినందుకుగాను టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చేవెళ్ల సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు మీర్‌పేట్ కార్పొరేషన్ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ మీర్‌పేట్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క రాజేందర్ రెడ్డి, మాదరి సురేఖారమేశ్, పార్టీ నాయకులు వంటేరు నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి అవయవ దానం



వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన ఎటికల వెంకటేశ్వర్లు(35)కు ఈనెల 9న రోడ్డు ప్రమాదం జరిగింది. మెరుగైన చికిత్స నిమిత్తం అతని కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ధ్రువీకరించారు. అతని భార్య, కుటుంబ సభ్యులు అతని అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావడంతో అతని కాలేయం, కిడ్నీలు, కళ్లను సేకరించారు.

కార్పొరేట్ దిగ్గజాల కోసమే కమలం పార్టీ

● ప్రొఫెసర్ కంచె ఐలయ్య



మాట్లాడుతున్న ప్రొఫెసర్. కంచె ఐలయ్య

రాంనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే కమలం పార్టీ పనిచేస్తుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. మెజారిటీ ప్రజల అభివృద్ధికి దోహదపడ్డ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే-అంబేడ్కర్‌ల జనజాతర రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉడత రవీందర్, ఆవాజ్ కార్యదర్శి ఎండి.అబ్బాస్, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, తెలంగాణ గిరిజన సం ఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, నా యకులు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి గణేష్, దశరథ్, సుబ్బారావు పాల్గొన్నారు.

25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయని, మే 2 వరకు జరుగుతాయని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాస్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఇంజాపూర్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

● కంపుకొడుతున్న మిధానీ కాలనీ ● ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన స్థానికులు



హయత్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. ఓపెన్ డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. గ్రామ పంచాయతీ నుంచి ఇంజాపూర్ మున్సిపాలిటీగా మారినా పారిశుధ్య నిర్వహణ మాత్రం మారకుండా ప్రజలకు చికాకు తెప్పిస్తుంది. శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇంజాపూర్ 24వ వార్డులోని ప్రధాన రోడ్డు నుంచి మిధానీ కాలనీ గుండా తొర్రూర్ రోడ్డు వరకు అధికారులు ఓపెన్ నాలా నిర్మించారు. నాలా పక్క నుంచే భూగర్భ డ్రైనేజీ లైన్ కూడా నిర్మించారు. రెండు లైన్లు వ్యర్థాలతో నిండి జాం అయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగునీరు పేరుకుపోయి దుర్గంధవాసన వస్తుంది. ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లు, విస్తరాకులు, మట్టితో నిండి లైన్ ముసుకుపోయింది. అనేక ప్రాంతాల్లో మురుగునీరు బయటకు వచ్చి కంపుకొడుతుంది. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. మురుగు వాసనతో సాయంత్రం అయిందంటే ఇంట్లో ఉండలేకపోతున్నామని పలువురు కాలనీవాసులు తెలిపారు. రెండు డ్రైనేజీ లైన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తీసి వేసినట్లయితే మురుగునీరు సాఫీగా కిందకు వెళ్లే అవకాశం ఉంది. అయినా శానిటేషన్ సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ అధికారులు మురుగునీటి వ్యవస్థపై దృష్టి సారించకపోవడంతో ఇంజాపూర్‌లోని పలు కాలనీల ప్రజలు దుర్గంధ వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ అంటు రోగాలు వస్తాయోనని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం ముక్కు పిండి ఇంటి, కమర్షియల్ ట్యాక్సులు వసూలు చేస్తున్నారే కానీ వసతులు కల్పించడం లేదని మున్సిపాలిటీ అధికారుల తీరుపై ఇంజాపూర్ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇంజాపూర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఓపెన్ నాలా



మురుగునీటిపై ఎమ్మెల్యే రంగారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఇంజాపూర్ మిధానీ కాలనీవాసులు

వెంటనే క్లీన్ చేయండి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇంజాపూర్ మిధానీ, పరిసర కాలనీకి చెందిన శంకర్‌గౌడ్, హరిశంకర్, వంశీధర్‌రెడ్డిలు పేరుకుపోయిన మురుగునీటి వ్యవస్థపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫోన్ చేసి ఇంజాపూర్‌లో పేరుకుపోయిన మురుగునీటి కాలువను, డ్రైనేజీ లైనును క్లీన్ చేయించాలని ఆదేశించారు. ఇన్ని రోజుల నుంచి ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గారడి మాటల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి, మరోసారి గారడి మాటలతో ప్రజలను మోసం చేయడానికి ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ మన్సూరాబాద్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, నాగోల్, హయత్‌నగర్ డివిజన్ల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని ఎంతఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, యెగ్గె మల్లేషం, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. విద్యుత్, నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా కాలం వెల్లదీస్తుందన్నారు. ఇలాంటి సర్కారుకు బుద్ధి చెప్పాలంటే ఎల్లప్పుడు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, కుంట్లూర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, చెరుకు సంగీతాప్రశాంత్‌గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేడీ కండక్టర్‌పై యువకుడి దాడి

సైదాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లేడీ కండక్టర్‌పై ఓ యువకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మిధానీ డిపో రూట్ నెంబర్ 203ఏ బస్ శనివారం మలక్‌పేట నుంచి సైదాబాద్ వైపు వెళ్తుంది. చంచల్‌గూడ ప్రెస్ వద్ద బస్ ఎక్కిన చంపాపేటకు చెందిన అవినాష్ టికెట్ తీసుకొనే క్రమంలో కండక్టర్ నాగ మణితో వాగ్వాదానికి దిగి ఆమెపై దాడిచేశాడు. ఈ ఘటనలో నాగమణి చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. వెంటనే బస్‌ను డ్రైవర్ సైదాబాద్ పీఎస్‌కు తీసుకు వచ్చి అవినాష్‌ను పోలీసులకు అప్పగించాడు. గాయపడ్డ కండక్టర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌ను విశ్వగురుగా నిలబెడుతున్న ప్రధాని మోదీ

● ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు విశ్వగురు స్థానంలో ఉన్నటువంటి భారత్ విదేశీ దండయాత్రల కారణంగా ఎంతో కోల్పోయిందని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అ న్నారు. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక దేశానికి అత్యున్నతస్థితి కల్పించి మళ్లీ విశ్వగురుగా నిలబెట్టాలని కంకణబద్దులయ్యారని ఆయన చెప్పారు. కొత్తపేటలోని స్పైసీ హబ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఉన్న విలువైన సంపద విదేశీయులు దోచుకున్నారని దేవాలయాలు ఆక్రమణలకు, దోపిడీకి గురయ్యాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను రూపుమాపాలన్న దురాలోచనతో విదేశీ పాలకులు దేవాలయాలను ధ్వంసం చేశారన్నారు. అలా శతాబ్దాల క్రితం కూల్చివేసిన శ్రీరామ జన్మభూమి అయోధ్యలో రామాలయాన్ని తిరిగి ఇన్నేళ్లకు నిలబెట్టిన ఘనత మన ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం శ్రమిస్తున్న మోదీని మరోసారి ప్రధానిగా చేయడానికి మల్కాజిగిరిలో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, వి. సుధాకర్‌శర్మ, ఎంవీ సుభాష్, అన్నావర్జుల సూర్యప్రకాష్, నిరంజన్ దేశాయి, సతీష్ పాల్గొన్నారు.

పార్టీని నిలబెట్టిన కార్యకర్తలను కాపాడుకుంటా

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్యకర్తలనందరిని కాపాడుకుంటామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎల్‌బీనగర్‌లో చేపట్టాల్సిన ప్రచారాలు, బూత్ కమిటీల ఏర్పాటు తదితర విషయాలపై వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా చాలా మంది కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. వారందరికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇటీవల పార్టీలో కొత్తగా చేరిన వారిని కూడా కలుపుకుని వెళ్లాలన్నారు. ఈనెల 16న కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు రాహుల్‌గాంధీ చేతుల మీదుగా విడుదల చేసిన జాతీయ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్, పార్టీ నేతలు ఎస్వీ కృష్ణప్రసాద్, చలకాని వెంకట్, లింగాల నాగేశ్వర్ రావు, ఈశ్వరమ్మయాదవ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహయాదవ్, సదాశివుడు పాల్గొన్నారు.

ప్రజాపాలన కొనసాగాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలి

● టీటీడీ పాలకమండలి సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన నిరంతరం కొనసాగాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు సీతా రంజిత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్‌లో సీతా రంజిత్‌రెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే అయిదు సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించిందన్నారు. ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్ రావు, బొడ్డుపల్లి మహేందర్, యాదయ్య, రమేష్‌నేత, నరసింహ, లింగస్వామిగౌడ్, ఎల్లయ్య, జ్ఞానేశ్వర్, రాజునాయక్, లక్ష్మి, రేణుక, సరస్వతి, సుజాత, శైలజారెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్టేడియంలో జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో

కవాడిగూడ : దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు, చేతివృత్తుల వారు తయారు చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్రమాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జా తీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ఆయన రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావుతో కలిసి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన దాదాపు 300 స్టాళ్లను సందర్శించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మేయర్ పారిజాతారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ మీది వార్డులో గల అభయాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణం పనులు పూర్తి కావడంతో మూడు రోజులుగా స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారు జాము నుంచి పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అర్చనలు, హోమాలు నిర్వహించి, అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఆ తర్వాత స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర కాలనీలు, గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, ఇతర నేతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోటల్‌లో అనుమతి లేకుండా బీజేపీ సమావేశం

● నిర్వాహకుడితోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసిన ఎన్నికల అధికారులు, పోలీసులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని ఓ హోటల్‌లో అనుమతి లేకుండా మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా బ్రాహ్మణ కుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన నిర్వాహకునిపై ఎన్నికల అధికారులు, చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాహ్మణ కుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కొత్తపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించగా మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విచ్చేసి బీజేపీ కి ఓటువేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా సమావేశంలో పాల్గొన్న వారికి సిల్వర్ కోటింగ్‌తో కూడిన గణేశ ప్రతిమను పంపిణీ చేశారు. ఎన్నికల అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-5 ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం హుటాహుటిన చేరుకున్నారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీయగా ఎన్నికల ఆర్‌వో అనుమతి లేకుండా సమావేశం నిర్వహించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సమావేశం నిర్వాహకుడైన పెండ్యాల సతీష్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేశారు.

గోవులను అపహరించి, చంపి మాంసం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

వనస్థలిపురం : గోవులను అపహరించి వాటిని చంపి మాంసం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పాతబస్తీకి చెందిన మహమ్మద్ ఇలియాస్ ఖురేషి, ఎండీ తబ్రేస్ షేక్, మహమ్మద్ రఫీక్‌లు ఒక ముఠాగా ఏర్పడి ఎల్‌బీనగర్, మీర్‌పేట్, ఉప్పల్ ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్లపై, ఇళ్లకు దూరంగా ఉన్న గోవులను గుర్తిస్తారు. ఆ గోవులను ఎవరు లేని సమయంలో కారులో వచ్చి వాటికి మత్తు మందును ఇస్తారు. మత్తులో ఉన్నప్పుడు ఆ గోవులను వాహనంలో ఎక్కించుకుని పాతబస్తీలోని కాలపత్తర్‌కు చెందిన షాబాద్ ఖురేషి, మహ్మమద్ నవాజ్ ఖురేషిలకు అప్పగించి వారి నుంచి నగదు తీసుకుంటారు. కాగా గత నెల 24న మన్సూరాబాద్ జడ్జెస్ కాలనీలో ఉన్న ఓ గోశాలకు వెళ్లి అక్కడ ఉన్న 5ఆవులకు మత్తుమందు ఇవ్వడంతో అందులో ఒక ఆవు మృతిచెందగా, మిగిలిన మూడు ఆవులను తమ వాహనంలో తీసుకెళ్లారు. తమ గోశాలలో ఆవులు అపహరణకు గురైనట్లు గోశాల నిర్వాహకుడు వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గోవులను విక్రయించిన దుకాణదారులు షాబాద్ ఖురేషి, నవాజ్ ఖురేషిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. గోవులకు మత్తు మందు ఇచ్చి అపహరిస్తున్నట్లు నిజం ఒప్పుకోవడంతో వారిని అరెస్ట్ చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద ఒక మత్తు ఇంజక్షన్, నాలుగు సిరంజీలు, ఆరు తాళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను ఎత్తుకెళ్తున్న ఇలియాస్, తబ్రీస్, రఫీక్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా వీరిపై గతంలో ఉప్పల్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన గోదాంపై పోలీసుల దాడి

● 280 బస్తాల బియ్యం, గోదాం సీజ్, ఇద్దరిపై కేసు నమోదు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన గోదాంపై పోలీసులు దాడి చేసి 280 బస్తాల బియ్యంతో పాటు గోదాంను సీజ్ చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురంలోని డబుల్ బెడ్రూం సముదాయంలో రెండవ అంతస్తులో నివాసముండే నెహ్రూనాయక్ పవార్(27), ఇతని స్నేహితుడు రాథోడ్ గౌరయ్యనాయక్(27)లు ఇద్దరు కలిసి కొంత కాలంగా పలువురి వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి తొర్రూర్ రోడ్డులోని డబుల్ బెడ్రూం సముదాయాల వద్ద గోదాంలో రేషన్ నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తారు. ఈ గోదాంలో 280 బస్తాలు (85 క్వింటాళ్లు) రేషన్ బియ్యం నిల్వ ఉంచారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గోదాంపై దాడి చేశారు. గోదాంలో ఉన్న 280 బస్తాలు రేషన్ బియ్యం, గోదాంను సీజ్ చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్న నెహ్రూనాయక్ పవార్, రాథోడ్ గౌరయ్య నాయక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల దర్శన టికెట్లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుమల దర్శన టికెట్లు ఇప్పిస్తానని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌కు చెందిన కపిల్ కుమార్‌రెడ్డికి చరణ్ అనే ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను టీటీడీ చైర్మన్ భూమన కర్ణాకర్‌రెడ్డి పీఏను అంటు చరణ్ నమ్మించాడు. దీంతో కపిల్ కుమార్‌రెడ్డి తిరుమల శ్రీవారి దర్శనం కోసం టికెట్స్ ఇప్పిస్తానని చరణ్ నమ్మించడంతో ఈనెల 7 తేదీన రూ.1లక్ష 60వేల నగదును ఆన్‌లైన్లో కపిల్ కుమార్‌రెడ్డి ట్రాన్స్‌ఫర్ చేశాడు. కాగా కపిల్‌కుమార్‌రెడ్డి చరణ్‌కు టికెట్ల కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఫోన్ ఎత్తకుండా దాటవేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన కపిల్‌కుమార్‌రెడ్డి తాను మోసపోయానని గ్రహించి శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకుడి అరెస్ట్

సైదాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకుడిని శనివారం సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంతోష్‌నగర్‌లో నివాసముండే కృష్ణదొర మలక్‌పేట పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తాడు. సోమవారం ఉదయం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ డ్యూటీ చేస్తుండగా ఆయనకు సైదాబాద్ పీఎస్ నుంచి ఫోన్ వచ్చింది. మాధవనగర్ రోడ్డుపై తండ్రి కొడుకులు గొడవ పడుతున్నారని సమాచారం అందిందని వెంటనే అక్కడికి వెళ్లాలని సూచించారు. దీంతో అతడు పెట్రోలింగ్ వాహనంలో తోటి సిబ్బందితో సహా అక్కడికి వెళ్లాడు. మాధవనగర్‌కు చెందిన కోటప్ప అతడి కుమారుడు వరుణ్ గొడవపడుతున్నారు. వద్దని వారించే యత్నం చేయగా వరుణ్ దుర్భాషలాడుతూ హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేయగా గాయాలయ్యాయి. ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. తప్పించుకుని తిరుగుతున్న వరుణ్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.